


రంగమ్మ దిగాలుపడి కూర్చుంది.

గంట క్రితం కొడుకు చెప్పిన మాటలను పదేపదే గుర్తుకు తెచ్చుకుని ఎంతగానో బాధ పడిపోయింది. "ఇంక వాడు నా కొడుకు కాడు. నా చెయ్యి దాటిపోయేడు' అని అప్పటి కామాట నూట ముప్ఫయ్యోసారి ఆమె అనుకోవటం.

వాడు అనసూయమ్మ కూతురు రాజ్యంని తప్ప మరెవ్వరినీ పెళ్లాడడట! ఆ అనసూయమ్మకీ, తనకీ చుక్కెదురు. ఆ సంగతి పుట్టి బుద్దెరిగిన దగ్గరనుండి రఘుకి బాగా తెలుసు. తెలిసి తెలిసీ అలా అనటంలో వాడి ఉద్దేశ్యం ఏమిటి? తన మాటంటే అంత నిర్లక్ష్యమా? తన బద్ధశత్రువు కడుపున పుట్టిన పిల్లని—ఆ షోకులాడిని చేసుకుని తనని అవమానపరుస్తాడా వాడు?

రంగమ్మ మనసు కుతకుత ఉడికిపోయింది. ఆమె శరీరం భగభగ మండిపోయింది.

"చచ్చినా యీ పెళ్ళి జరగనీయను" అంటూ భయంకరంగా ప్రతిజ్ఞ చేసింది రంగమ్మ. అదే మాటను కొడుకు వచ్చేక ఎంత కటువుగా చెప్పవచ్చునో అంత కటువుగానూ చెప్పింది.

ఐతే రఘు అంతకన్న భయంకరమైన ప్రతిజ్ఞ చేసేడు. "నేను పెళ్ళంటూ చేసుకుంటే రాజ్యంనే చేసుకుంటాను" అని.

అంతేకాదు. "ఈ యిరవయ్యేళ్లూ నువ్వు చెప్పినట్టు విని చవటలా తయారయ్యేను, కనీసం నా పెళ్ళివిషయమన్నా స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆలోచించుకోనీయ్" అంటూ దభీల్న గది తలుపులు గడియపెట్టుకున్నాడు రఘు.

రంగమ్మకి నోట మాట రాలేదు.

వీడి కిదేం పొయ్యేకాలం? ఇరవై యేళ్ళ బొట్టి వెధవ, నిన్న మొన్నటివరకు తన పక్కలో పడుకున్న పసికూనకు అప్పుడే పెళ్ళి కావలసి వచ్చిందా? అసలు ఇది వీడికి పుట్టిన బుద్ధేనా యిది? లేక ఎవరన్నా వీడికి నూరిపోసేరా? ఔను. ముమ్మాటికీ యిదంతా అనసూయమ్మ ముండ చేసిన పనే! అది వట్టి మహమ్మారి. నా కొడుక్కు ఏదో మందుబెట్టి తనవైపుకు తిప్పుకుంది. ఈ చెవుల సన్నాసి ఆ పిల్ల షోకులూ, పోకిళ్లూ చూసి మతి పోగొట్టుకున్నాడు. ఈ పెళ్ళి నెలాగైనా సరే ఆపెయ్యాలి. కాని ఎలా? ఎలా?

ఆలా ఆలోచిస్తూ ఆ రాత్రంతా గడిపింది రంగమ్మ.

అలాటి నిద్రలేని రాత్రులు పదన్నా కాక ముందే ఓ శుభముహూర్తాన గుళ్ళో పెళ్ళి చేసుకుని కొడుకు, కోడలు పసుపుబట్టలతో గడపలో అడుగుపెట్టేరు.

వాళ్లను చూస్తూనే స్తంభించిపోయింది రంగమ్మ.

తరువాత పెద్దపెట్టున ఏడిచింది.

ఆ తరువాత గుండెలు బాదుకుని ఊరు ఊరంతా వినపడేలా అరచింది. యాగీ చేసింది, "నూతిలో పడి చస్తా" నంది. "ఈ యింట్లో నేనన్నా ఉండాలి. లేక అదన్నా (కోడలు) ఉండాలి. ఇద్దరం ఉండటానికి వీల్లేదు" అంటూ హుంకరించింది. అనసూయమ్మను దుమ్మెత్తిపోసింది.

ఆమె ఎంత ఏడిచినా, అరచినా రఘు, రాజ్యం ఏం మాట్లాడలేదు.

కాని యిరుగు పొరుగు, బంధువులు అంతా వచ్చి రంగమ్మనే చీవాట్లు పెట్టేరు. "ఏమయిందనమ్మా అంత రభస చేస్తావు? రాజ్యానికేం తక్కువని? కులం కాని పిల్లా? గుణంలేని పిల్లా? ఈడుజోడూ కుదిరింది, వరస కలిసింది. చదువుకున్నది, చక్కనిది— ఇంతకన్నా మంచి కోడలు నీకు దొరుకుతుందా? అనసూయమ్మంటే నీకు గిట్టకపోతే దానితో మాట్లాడకు. దావింటికి పోకు.

అంతేకాని ఆ పిల్లేం చేసింది? మంచిగా కొడుకూ కోడల్నూ చూసుకుని కృష్ణా రామా అంటూ బ్రతుకు...." అంటూ సలహా యిచ్చేరు.

ఆ మాటలు వింటూనే బుస్సుమంటూ లేచింది రంగమ్మ.

"ఆఁ ఆఁ. మాటలకేం? బాగానే చెప్తారు. నాలాగా మీకు జరిగితే అప్పుడుకాని తెలియదు మీకు నా బాధ!" అంటూ కసురుకుంది.

"ఈవిడ బుద్ధి తెలియని దెవరికిలే!" అనుకుంటూ—మూతులు తిప్పుకుంటూ ఎవరి దారిన వారు పోయేరు.

రంగమ్మకి కొడుకు యీ పెళ్ళి చేసుకున్నందుకే కాదు కోపం. అసలు పెళ్ళి చేసుకున్నందుకే బాధ! రఘు అసలు పెళ్ళే చేసుకోకూడదు. అందునా యింత చిన్న వయస్సులో చేసికోవటం అసలు యిష్టంలేదు రంగమ్మకి.

కాని ఆ విషయాన్ని పైకి చెప్పే ధైర్యం లేక రహస్యంగా తన మనసులోనే దాచేసుకుంది రంగమ్మ.

అందుకే ఆమెకంత బాధ! అంత ఉక్రోషం! అంత క్రోధం! లోపలికి మ్రింగలేక, బయటకు కక్కలేక....నానా అవస్థలు పడుతోంది రంగమ్మ.

ఐపోయింది. అంతా ఐపోయింది. ఇంక రఘు తనవాడు కాడు. ఒక ఆడదాని పక్కన జేరేక యింక మగవాడికి తల్లి గుర్తుంటుందా? అసలే వాడీ మధ్య తనకి దూరం దూరంగా ఉంటున్నాడు ఈ పెళ్ళితో తన జీవితంలో ఉన్న ఒకే ఒక్క చిన్న ఆధారం కూడా తెగిపోయింది

రంగమ్మ ఆ రోజల్లా గుండె లవిసేలా ఏడ్చింది. ఈ ప్రపంచంలో తను ఒంటరిగా మిగిలిపోయేననీ, అందరూ ఎంతో ఆనందంగా త్రుళ్ళిపడుతుంటే తా నొక్కతే దుఃఖంతో క్రుంగిపోతోందనీ భావించింది రంగమ్మ.

రాజ్యంని చూస్తుంటే వంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్టుంది రంగమ్మకి. "దీని అందం, చందం చూస్తే ఎంత కొమ్ములు తిరిగిన మగవాడైనా సరే కొంగు పట్టుకుని తిరక్క మానడు" అనుకుంది "దీనికి భగవంతుడు ఏ గుడ్డికన్నో కుంటి కాలో, పెడ్తే ఎంత బాగుండేది!" అనుకుంది కసిగా.

రాత్రి తలుపులు బిగించుకుని కొడుకూ, కోడలూ పగలబడి నవ్వుకోవటం. గుసగుసలాడుకోవటం, గుణుగుతూ, దీర్ఘాలు తీస్తూ, గాజులు చప్పుడుచేస్తూ రాజ్యం మొగుణ్ణి మచ్చిక చేసుకోవటం అన్నీ వింటూ ఆ మూసిన తలుపుల వంకనే గుర్రుగా చూస్తూ కూర్చుంది రంగమ్మ.

తన శోభనంనాటి రాత్రి గుర్తుకువచ్చింది ఆమెకు. అప్పటికి తన వయసు పధ్నాలుగు. భర్త వయస్సు ఏభై రెండు. ఆ రాత్రి ఎంతటి నరకాన్ని అనుభవించిందో యిప్పటికీ గుర్తుకు వస్తే వళ్ళు జలదరిస్తుంది.

కాని తన శరీరంలాగానే మనసుకూడా చాలా త్వరలోనే మోటుబారిపోయింది. సహజవాంఛలు గుర్రాల్లా పరుగులు పెడ్తుండగానే తనకి నెల తప్పింది. తొమ్మిదినెలల విందుమూలాలుగా ఉండగానే తనకి వైధవ్య ప్రాప్తి కలిగింది.

భర్తతో శారీరకంగా గడపిన ఆ ఒక్క సంవత్సరం ఏదో కలలా గడిచిపోయింది. అది మామూలు కల కూడా కాదు. పీడకల. ఆ భయంకరమైన కలనుండి మేల్కొనేసరికి తన ముందు పెద్ద ఎడారిలాటి జీవితం పరుచుకుని ఉంది.

పిల్లల్ని కనకుండా ఇరవై సంవత్సరాలు తన భర్తతో కాపురం చేసి, అతని మొదటి భార్య కన్నుమూసిన పది రోజులకే కటిక దరిద్రుల ఇంట్లో కడసారి ఆడపిల్లగా పుట్టిన తనని ఆయనకిచ్చి పెళ్ళి చేసేరు.

పేరుకైతే తనని పెళ్ళి చేసుకున్నాడు కాని ఒక్కరోజయినా తనతో మనసువిప్పి మాటాడలేదు. రాత్రిళ్ళు విధిలేక ఒకేమంచం మీద పడుకున్నందువల్లనో ఏమో ఆయనకి తన అవసరం వచ్చేది అప్పుడప్పుడు. పైగా రోజూ ఆయన అనుభవించి ఆనందించే భోగంవాళ్ళు, కూలినాలి చేసుకునే స్త్రీలు—వాళ్ళందరితోపాటు తనని కూడా ఒక ఆనంద సాధనంగా భావించేవాడు. అంతకు తప్ప తన మీద ప్రత్యేకమైన శ్రద్ధగాని ప్రేమగాని, ఆయనకు ఉండేవికావు. ఆ వయసులో వాటి అవసరం కూడా తనకి కనపడేదికాదు. శారీరకమైన అనుభవం తప్ప మరో విషయాన్ని భర్తనుండి ఆశించేంత తెలివితేటలు తన కప్పట్లోలేవు

కాని పెళ్ళయి ఏడాదన్నా తిరక్కముందే పిల్ల తల్లయి జీవితంలోని సుఖాలన్నిటినీ పోగొట్టుకున్న తరువాత తనకి జరిగిన అన్యాయం, తనపట్ల ఆయన చూపిన క్రూరత్వం, నిర్లక్ష్యం తెలిసివచ్చి. కించపడింది. "నన్నలా హింసపెట్టినవాడు, అవమాన పరిచినవాడు....నన్నుకాదని అడ్డమైన ఆడదాన్ని పొందినవాడు—ఇప్పుడు కనుక బ్రతికివుంటే ఆయనను భరించగలిగి ఉండేదాన్నా?" అనుకుంది.

ఐతే అతని మరణంవల్ల తన జీవితంలో ఎన్నటికీ పూడని వెలితి ఏర్పడిపోయింది. పట్టుమని పదిహేనేళ్ళు నిండకముందే పసుపు కుంకుమను పోగొట్టుకున్న రంగమ్మ హృదయంలోని రాగ రేఖలు మాత్రం వెలిసిపోలేదు. నానాటికీ ఆ రంగులు మరింత గాఢంగా ప్రజ్వరిల్లి ఆమె శరీరాన్ని కాల్చివేయ సాగినయ్.

నానాటికీ రఘు పెద్దవాడౌతున్నకొలదీ ఆమె శరీరంలోని యౌవనం పరిపక్వానికి వచ్చేసరికి రఘు స్కూల్లో చేరేడు. వేడి నిట్టూర్పులతో, అశాంతితో, అధర్మమైన ఆలోచనలతో, తీరనికోరికలతో, విసిగి వేసారిపోయి ఎన్నో సంవత్సరాలు నెట్టుకుంటూ గడుపుతోంది రంగమ్మ. ఈ ఇరవై సంవత్సరాలూ తనలోని అసంతృప్తి వాంఛలు ఆదిశేషుని పడగల్లా విస్తరిల్లి బుసలుకొడ్తూ తన చుట్టూ ఉన్నవారినీ తననీ కాటు వేస్తూనే వున్నయ్.

ఆ కోరికలతో హోరాహోరి పోట్లాడి

వాటిని జయించలేక, వాటికి లొంగిపోయే ధైర్యం లేక తనస్థితికి తీసుకువచ్చిన సంఘాన్నీ, తన కిలాటి బ్రతుకును వ్రాసి పెట్టిన దేవుణ్ణీ కసిదీరా తిట్టుకుంటూ భయంకరమైన మనస్తత్వాన్ని పెంచుకుందిరంగమ్మ.

ఆమె అసంతృప్తికీ అశాంతికీ అన్నిటికీ కేంద్రంగా రఘు నిల్చేడు. రఘుని చూస్తుంటే ఏదోతెలియని కసి, ద్వేషం కలిగేది రంగమ్మకి. "వీడు పుట్టకముందే తండ్రిని చంపేసేడు. తన బ్రతుకును నట్టేట ముంచేడు. వీడు నా గర్భశత్రువు." అనుకుని వాడిని చీటికీ మాటికీ కసిదీరా చావబాదుతూండేది.

మరుక్షణమే సహజమైన మాతృభావం ఆమెలో పెల్లుబికి వాడిని దగ్గరకు తీసుకునేది.

వాడు కాస్త పెద్దవుతున్నకొలదీ, వాడు మానసికంగా ఎదిగి తన కెక్కడ దూరమవుతాడోనన్న బెంగ పట్టుకుని పీడించసాగేది రంగమ్మకి. అందుకే బంధువు లెవరింటికీ రఘుని పోనిచ్చేదికాదు తను తప్ప యితరులెవరు అతనిని ప్రేమగా చూసినా సహించేది కాదు రంగమ్మ. "తండ్రిలేని పిల్లవాడు" అంటూ ఎవరైనా వాడిని కాస్త దగ్గరకు తీస్తే "చాల్చాల్లే! మీ బోడి సానుభూతి మాకేం అక్కర్లేదు. తండ్రి లేకపోతేనేం? తండ్రినీ, తల్లినీ అన్నీ నేనే ఐ వాడిని పెంచుతాను" అనేది సగర్వంగా.

రఘు తను ఏం చెప్పినా చచ్చినట్లు వినవలసిందే! తనకిష్టం లేనపుడు అరచి గీపెట్టినా నయాపైసా కూడా యిచ్చేది కాదు కొడుక్కి. ప్రేమవస్తే పది రూపాయలు అడక్కుండానే జేబులో పెట్టేది. అలా ప్రవర్తించటానికి కారణం ఒక్కటే! వాడు తను చెప్పినట్టు వినాలి, తనకి లొంగి ఉండాలి. తనని తప్ప ఎవరినీ ప్రేమించకూడదు. అదే ఆమె ఆశయం!

ఇలా ఓ పక్క కొడుకుని తన దురభిమానం దురాశ అనే చెరసాల్లో బంధించి వేస్తూ అంతటితో ఊరుకోక ఊళ్ళోని వాళ్ళందరితోనూ పోట్లాటలు పెట్టుకుని ఆవిడ శీలం చెడ్డదని గుణం గుడి సేటిదని ఊరంతా వినపడేలా ప్రకటించితే గాని ఆ రాత్రి కంటికి హాయిగా కునుకు పట్టేది కాదు రంగమ్మకి.

పోట్లాటలు వచ్చినప్పుడు మగవాళ్ళకు కూడా భయపడేదికాదు రంగమ్మ. పైగా రెట్టించిన ఉత్సాహంతో నడుం బిగించి మరీ రంగంలోకి దిగేది.

"నీ పెళ్ళాం మొన్నరాత్రి ఎవడితో గడిపిందో మీకు తెలియకపోయినా ఊరందరికీ తెలుసు" అనేది. ఆ మాట వింటూనే పిల్లిలా మారిపోయి తల వంచుకుని యింట్లోకి దూరిపోయేవాడు.

ఆవిడ నోటి దురుసు తనానికి దడవని మగవాడు ఆ ఊరు మొత్తంమీద లేడు.

ఊళ్ళో అయినవారు, కానివారు అందరూ బద్ధశత్రువులే అయినప్పటికీ—అప్పుడప్పుడు ఆమె మనసులో జనించే ప్రేమాంకురాలకు రఘుతోటి సాహచర్యం కొంత దోహదమిస్తూండేది. కాని పెళ్ళయినాక ఆ ఒక్క ఆశకూడా ఆమె జీవితానికి లేకుండా పోయింది. ఎంత చెడ్డదయినా, ఎన్నికొట్టినా, తిట్టినా కన్నతల్లి అన్న మమకారంతో, రఘు ఆమె ఆజ్ఞలను శిరసావహించేవాడు.

కాని పెళ్ళయిన తరువాత గాలిలోని దీపంలా ఆ కాస్త మమకారం కూడా ఎక్కడ పుటుక్కున తెగిపోతుందోనని ఆమె భయం. అందుకే రఘుని వీలయినంత వరకు ఆ జన్మాంతరం బ్రహ్మచారిగానే ఉంచాలని కోరుకునేది అంతరాంతరాల్లో రంగమ్మ.

కాని ఆమె ఆలోచనలకు విరుద్ధంగా పట్టుమని యిరవై యేళ్ళన్నా నిండకుండానే యిటు కాలేజీలో డిగ్రీపుచ్చుకుని ఉద్యోగంలో చేరటం, అటు కన్యా పాణిగ్రహణం చేయటం రెండూ యించుమించుగా ఒకేసారి చేసేసేడు రఘు.

అందుకే రంగమ్మ వళ్ళంతా మండిపోతోంది. అసూయతో ఆమె హృదయం దహించుకుపోతోంది.

తన మనసులోని ఆలోచనలనులోకంలో యెవరికి చెప్పినా తనని అసహ్యించుకుంటారు. అందుకే ఆ ఆలోచనలతో తననితానే హింసించుకో సాగింది రంగమ్మ.

రఘు పెళ్ళయిన దగ్గరనుండి రంగమ్మ మనసులో వింత భావాలు కలగసాగినయ్. తన కంటిముందు చిలకా గోరింకల్లా తిరుగుతున్న ఆ జంటను చూస్తుంటే నలభయ్యోపడిలోకి ప్రవేశించిన రంగమ్మకు తాను జీవితంలో పోగొట్టుకున్న అపూర్వానందాలను గూర్చిన ఆలోచనలే తరచు కలుగుతుండేవి.

రఘు ఇంట్లో ఉన్నంతసేపూ ఒక్కక్షణమైనా భార్యని వదిలి వుండడు. ఆమె తల దువ్వుకుంటుంటే వెనకనుండి వచ్చి ఆమెకు గిలిగింతలు పెడ్తాడు. ఫక్కున నవ్వుతూ రాజ్యం అతనిమీద వాలిపోయేది. పొడుగాటి ఆమె వెంట్రుకలు అతని ముఖాన్ని కప్పేసేవి. ఆ తరువాత చూసే ధైర్యం లేక యివతలకు వచ్చేది రంగమ్మ. కాని కొన్ని గంటలవరకు ఆదృశ్యమే మాటి మాటికి ఆమె కళ్ళముందు కదలి ఆమె గుండెలోని రక్తప్రసారంయొక్క వేగాన్ని హెచ్చించేది.

రఘుకి భార్యమీద యెందుకంత ప్రేమ? ఇరవైయేళ్ళు పెంచిన కన్నతల్లి మీదలేని మమకారం నిన్న మొన్నా యింట్లో అడుగు పెట్టిన పెళ్లాంమీద యెలా పుట్టుకు వచ్చింది? ఆ రహస్యం యేమిటి? అది అతని మనసులో ఉందా? లేక వయసులో ఉందా?

భర్త తన నెప్పుడూ అలా చూడలేదే? ఆ సరదాలు, ఆ గిలిగింతలు, ఆ శృంగారం తనా ఒక్క సంవత్సరం వైవాహిక జీవితంలో ఒక్కసారైనా అనుభవించలేదే? తను రాజ్యం—యిద్దరూ స్త్రీలే!

కాని ఒక స్త్రీకి జీవితం అమృత భాండం. మరో స్త్రీకి విషపాత్ర. దీనికి కారణం యేమిటి? యెవరిలో వుంది లోపం? దైవేచ్ఛలోనా? సంఘ నియామాల్లోనా, లేక తన అదృష్టంలోనా?

తాను పొందలేని ఆనందాన్ని మరో స్త్రీ తన కళ్ళ ఎదుటే పొందుతుంటే చూస్తూ చూస్తూ ఎలా భరించటం?

రంగమ్మ తల తిరిగిపోయింది, ఆమెలో ఏదో తెలియని పాశవిక శక్తి ప్రవేశించింది,

"రాజ్యం! రాక్షసి! దానిని దానిని....చంపెయ్యాలి!" అని కసిదీరా అనుకునేది ఒంటరిగా ఉన్నప్పుడు. రాజ్యంని తన కొడుకు భార్య గాకాక, ఒక స్త్రీగా చూసి అసూయ పడసాగింది రంగమ్మ.

తన వయసు నలభై . అంటే అనేమంత పెద్ద వయసుకాదు. తనకంటె రెండేళ్లు పెద్దది కాంతమ్మ. మొన్ననే పురుడు పోసుకుంది. ఈ రోజుల్లో చదువుకున్న ఆడపిల్లలకు ముప్పై, ముప్పైఐదు సంవత్సరాలు వస్తేకాని పెళ్లిళ్ళు కావటం లేదు. అలాటిది తనలో కేవలం భర్తృహీన యన్న కారణంచేత కోరికలుడిగి పోవాలంటే అదెలా సాధ్యం?

అలా ఆలోచించు కున్నప్పుడల్లా రంగమ్మ పదేళ్ళు చిన్నదయిపోయేది.

రాజ్యం అంత అందంగా ఆకర్షణీయంగా కనపడటానికి గల ముఖ్యకారణాల్లో ఆమె అలంకరణకూడా ఒకటి అని రంగమ్మ దృఢ విశ్వాసం. అది రాసుకునే స్నోలు, పౌడర్లు అన్నీ రాసుకుంటే తనుమాత్రం అందంగా ఉండదా? అనుకునేది.

అలా అనుకోగానే అవన్నీ చేసుకుంటే తనెలా ఉంటుందో చూసుకోవాలన్న కుతూహలం కూడా కలిగింది రంగమ్మకి.

ఓ రోజు ఆదివారం సాయంత్రం సినిమాకి పోయొస్తామంటూ రఘు, రాజ్యం యిద్దరూ బయటకు వెళ్ళేరు.

ఇదే అదననుకుని రంగమ్మ తలుపులు బిగించి తడబడే అడుగులతో రఘు పడక గదిలోకి వెళ్ళింది.

గదిలో పెద్ద డ్రెస్సింగు టేబులా మనిషెత్తు అద్దం ముందు అలంకార వస్తువులన్నీ అందంగా అమర్చి ఉన్నాయ్. వణుకుతున్న చేతులతో క్రీము డబ్బామూత తీసి ముఖానికి ఓ ఉసిరికాయంత ముద్ద పులుముకుంది. "ఛీఛీ! ఇంత జిడ్డుగావుంది. ఇదేం అందం?" అనుకుంటూ టవల్‌తో ముఖం తుడుచుకుంది. తరువాత గులాబి రంగులో వున్న ఫేస్ పౌడరుతీసి ముఖానికి, మెడకు అరంగుళం మందాన రాసుకుంది. కొంత చేతులకు కూడా రాసుకుంది. కళ్ళ నిండుగా కాటుక పెట్టుకుంది నుదుట తిలకం బొట్టు పెట్టుకుంది. అక్కడే రాజ్యంకి ఎన్నిరంగుల చీరలున్నాయో అన్నిరంగుల గాజులూ వున్నాయ్. వాటిలో ఓ డజను గాజులు తీసుకుని ఆ చేతికో ఆరు, ఈ చేతికో ఆరు వేసుకుంది.

మెల్లగా రాజ్యం పెట్టె తెరిచి గులాబి రంగులోవున్న నైలెక్సు చీర కట్టుకుంది. అలంకరణంతా పూర్తయే సరికి ఆమెకి చెమటలు పట్టింది.

తడబడే అడుగులతో అద్దం ముందునిలబడి తన ప్రతిబింబాన్ని చూసుకుంది. ఆ ప్రతిబింబం తనదికాదు. ఎవరిదో! రంగమ్మ మనసు వశం తప్పిపోయింది.ఒక్క ఉదుటున వెళ్లి పట్టి మంచంమీదవాలిపోయింది.

ఏదో ఆరాటం....అశాంతి..ఆమె పిచ్చిగా మంచంమీద పొర్లింది. కాసేపు విరగబడి నవ్వింది. కాసేపు వెక్కి వెక్కి ఏడ్చింది.

ఈ పరుపు యీ స్పర్శ—ఎంత మధురంగా ఉంది! ఈ పరుపు మీదనే రోజూ తన కొడుకు రఘు, రాజ్యం ఒకరిలో ఒకరు లీనమై.... "ధన్ ధన్!" మన్న తలుపు చప్పుడు విని ఉలికిపడి లేచింది రంగమ్మ.

ఒక్క ఉదుటున బయటకు పరుగెత్తింది. కాని వెంటనే తన ఆకారం గుర్తుకు వచ్చి ఆగిపోయింది. ఇప్పుడేమి చెయ్యాలి?

"అమ్మా! అమ్మా!" రఘు కంఠం అది.

రంగమ్మ గుండె ఆగినంత పనయింది. సినిమాకు వెళ్ళినవాళ్ళు అప్పుడే ఎందుకు తిరిగి వచ్చినట్టు?

"అమ్మా! అమ్మా! తలుపుతీయ్!"

రంగమ్మ లోపలికి పరుగెత్తింది. గబగబ చీర విడిచి ట్రంకు పెట్టెలో కుక్కింది. పాత చీరకట్టి, బాత్ రూమ్‌లోకి వెళ్ళి ముఖం సబ్బుతో కడుక్కుంది. ఆ హడావిడిలో ఐదు నిమిషాల్లో చెయ్యగలిగిన పనిని పదిహేను నిమిషాల్లో చేసింది రంగమ్మ. అంతసేపూ రఘు తలుపు బాదుతూనే వున్నాడు.

పమిట చెంగుతో ముఖం తుడుచుకుంటూ బయటకు వచ్చి తలుపు తీసింది.

"ఇంతసేపు ఏం చేస్తున్నావ్?" విసుగ్గా అన్నాడు రఘు. తలుపు కొట్టీ కొట్టీ చేతులు నొప్పి పుట్టటంవల్ల.

"నిద్రపోతున్నాను రా! ఐనా యిప్పుడే సినిమాకని పోయిన వాళ్ళు అరగంటలోనే తిరిగి వస్తారని నేను అనుకున్నానా? ఇక్కడ నే నేమైనా యింట్లో తినిపోతున్నానని భయపడి యీ టక్కులాడి నిన్ను లాక్కొచ్చిందేమిటి?" అన్నది తన మనసులోని భయాన్ని ఆందోళనను, నేర భావాన్ని కప్పి పుచ్చుకునే నెపంతో, కోడలిమీద నిందవేస్తూ.

"టికెట్లు దొరకలేదు. అందుకని తిరిగి వచ్చేం. మధ్య దానిమీద విరుచుకు పడతావెందుకు" అన్నాడు రఘు తల్లి ముఖంలోకి తీక్షణంగా చూస్తూ.

"ఏమిట్రా అట్టా చూస్తావ్? కొడ్తావా యేమిటి? ఇంకేం పక్కలోకి పెళ్ళాం వచ్చిందికదా! తల్లి యెందుకు నీకు? ఎప్పుడు చస్తుందా ఇది అని కాచుకు కూర్చున్నావులే ఔనా?" అని గొణుక్కుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది రంగమ్మ.

రఘు మౌనంగా గదిలోకి వెళ్ళేడు. రాజ్యం ముఖం జేవురించింది. "మీ అమ్మ ....మీ అమ్మ....ఏం చేసిందో చూసేరా?" ఆయాసపడుతూ అన్నది.

"చూసేను. గట్టిగా మాట్లాడకు నాకంతా అర్థమయింది. ప్లీజ్! గట్టిగా అరవకు." అంటూ వెళ్ళి మంచం మీద పడుకుని రెండు చేతులలోను ముఖం దాచుకున్నాడు రఘు.

భర్త సిగ్గు పడుతున్నాడో, క్రోధంతో వణికి పోతున్నాడో, లేక అవమానంతో దహించుకు పోతున్నాడో అర్థం కాలేదు రాజ్యంకి.

మౌనంగా గదిని శుభ్రంచేసింది. చిందరవందరగా వున్న టాయిలెట్ సామానులను సర్దింది. రంగమ్మ తొందరలో గాజులు తీసేస్తుంటే నేలమీద పడిన గాజు ముక్కలను ఏరి కిటికీలోనుండి బయట పడేసింది. ఉండలా చుట్టి పెట్టెలో పడేసివున్న నైలెక్సు




చీరను చాకలికివేసే విడిచిన బట్టల్లో పడేసింది.

అన్నీ ఏదో యాంత్రికంగా చేస్తోందే కాని ఆమె గుండె మాత్రం దడదడ లాడుతోంది. "ఏమిటీ మనిషి? అంత వయసు మళ్లిన స్త్రీకి, వితంతువుకి—చెట్టంత కొడుకూ కోడలు యింట్లో వుండగా, రేపోమాపో మనవల నెత్తుకో బోతూ యివేమి బుద్ధులు?

అలాటి స్త్రీ తన అత్తగారనుకుంటే ఎంత అవమానం? ముందూ వెనకా ఆలోచించకుండా గబగబ వంటింట్లోకి వెళ్లింది. ఆమెకు ఆవేశంతో నోరు పెగిలిరాలేదు. ఏదో అందామని, ఆవిడమీద గట్టిగా అరుద్దామని ఆమె ఉద్దేశ్యం.

కాని యింకా ఆమె పెదవులను దాటి ఎలాటి శబ్దమూ బయటకు రాకమునుపే రంగమ్మ కోడలువంక క్రూరంగా చూస్తూ అన్నది. "ఏమిటే? ఎందుకలా నిలబడ్డావు? నాకు రంకు కట్టాలని చూస్తున్నావా? అలాటి బుద్ధులు మా యింటా వంటా లేవు. మీ అమ్మమ్మ, మీ అమ్మ, నువ్వు....అందరూ ఆ జాతికి చెందినవాళ్ళే! మీ సంగతి నాకు బాగా తెలుసు. నా కొడుకును పిచ్చివాణ్ణి చేసి చేసుకున్నావు. నీ సంగతేమిటో నేనూ చూస్తాను. పక్కింటి పిల్ల వచ్చి సరదాపడితే దానికి గాజులేసి పౌడరు రాసేను. అందుకని అవన్నీ నామీద కట్టాలని చూస్తున్నావుటే? పో! ఇక్కడనుండి లేకపోతే నా కొడుకు యింట్లో లేని సమయంలో నువ్వు ఎలాటి నాటకా లాడుతున్నదీ యిప్పుడే నలుగురూ వినేలా చెప్పేస్తాను జాగ్రత్త!" అంది.

ఆ మాటలు వింటూనే కళ్ళు బైర్లు క్రమ్మినయ్ రాజ్యంకి. తనని గురించే అంత కఠినంగా, అంత జుగుప్సాకరంగా మరో స్త్రీ—అందునా అత్త అలా మాట్లాడేసరికి ఆమెకు దుఃఖావేశాలతో నోట మాట రాక మూర్ఛిల్లిపోయింది.

తల్లి అరుపులకు బయటకు వచ్చిన రఘు "రాజ్యం" అంటూ అరచి ఆమెను ఎత్తుకుని మంచంమీద పడుకోబెట్టేడు.

కాని తల్లిముఖం చూడలేదు. ఆమెతో ఒక్క మాటన్నా మాట్లాడలేదు.

అతని ప్రవర్తన మరింత రంపపుకోతలాగయింది రంగమ్మకి. అతని మౌనాన్నిబట్టే అతని కంతా అర్థ మయిపోయిందని తెలిపింది రంగమ్మకి.

దాంతో మరింత రెచ్చిపోయింది రంగమ్మ. "ఏంరా? ఎందుకలా మూగి మొద్దులా మాట్లాడవు? అది చెప్పిన మాటలన్నీ విన్నావా? నేనే ఆ పౌడర్లు స్నోలూ రాసుకున్నా ననుకుంటున్నావా యేమిటి?" అంది హుంకరిస్తూ.

భార్య ముఖంమీద చన్నీళ్ళు చల్లి మెల్లగా అన్నాడు రఘు. "వేరే అది చెప్పట మెందుకమ్మా? నా కంటికే స్పష్టంగా కనిపిస్తుంటే?" అని వెంటనే గది తలుపులు మూసేసేడు, ఆమెకు వచ్చేందుకు అవకాశమీయకుండా.

రంగమ్మ అద్దం దగ్గరకు వెళ్ళి ముఖం చూసుకుంది. హడావిడిలో నీళ్ళతో కడుక్కున్న తిలకం బొట్టు చాలావరకు కరిగిపోక అలాగే ఉంది. కాటుకరేఖలు కళ్ళల్లో స్పష్టంగా కనపడుతూనే ఉన్నయ్.

రంగమ్మకి ఏమీ పాలుపోలేదు. కట్టె బొమ్మలా బిగుసుకుని కూర్చుండిపోయింది.

ఆ రాత్రి యింట్లో యెవరికీ భోజనాలు లేవు. రఘు రాజ్యం గది దాటి బయటకు రాలేదు.

తెలివి వచ్చిన తరువాత రాజ్యం భర్తను చూసి వెక్కివెక్కి ఏడ్చింది. "ఊరుకో రాజ్యం! ఏడవకు. చదువుకున్నదానివి, అన్నీ తెలిసినదానివి నువ్వుకూడా అలా ఎందుకు ఆవేశాలకు లొంగిపోతావు? అన్నాడు రఘు.

"మీ అమ్మ చూసేరా, నన్ను ఎలాటి మాటలన్నదో! అసలే నే నిప్పుడు వట్టి మనిషినికూడా కాదు—మూడో నెల. అంతటి




భయంకరమైన నిందలు వేస్తుంటే ఎలా నిలద్రొక్కుకోగలను చెప్పండి?'' అంది.

''ఆమె మాటలను పట్టించుకోకు రాజ్యం! నువ్వు నా భార్యవి. నా అర్ధాంగివి. నీమీద నాకు నమ్మకం, ప్రేమ ఉన్నయ్. మా అమ్మ జీవితంలో మమత, ప్రేమ అంటే ఏమిటో తెలియకుండా పెరిగింది.

''కటిక దరిద్రుల యింట్లో పుట్టి, కనీసపు ఆదరాభిమానాలను కూడా పొందలేకపోయింది పుట్టినింట్లో. ముసలి భర్తను, స్త్రీలోలుడిని చేసుకుని ఆయన బ్రతికిన ఒక్క సంవత్సరమూ యిటు శారీరక సుఖాలను కాని, అటు మానసికమైన అనుభూతులను కాని వైవాహిక జీవితంలో పొందలేక పోయింది. ఈ యిరవై సంవత్సరాల ఏకాకి బ్రతుకు ఆమె శరీరాన్ని మనసునీ ఎంతగా హింపించిందో నాకు తెలుసు. నా చిన్నతనంలో నిద్రపోకుండా అమ్మ రాత్రిళ్లు పిచ్చిపట్టినట్లు యిల్లంతా తిరగటం లేదా వెక్కివెక్కి ఏడవటం—యిప్పటికీ నాకు గుర్తు. ఆ వయసులో ఆమెకు రెండవ పెళ్ళి చేసే ధైర్యం పెద్దవాళ్లకుంటే—ఆమె యిలా రాక్షసిలా తయారయ్యేదికాదేమో!'' అన్నాడు రఘు నిట్టూరుస్తూ.

''మా మేనత్త ఒకావిడ ఉంది. ఆవిడకు పదేళ్ల వయసులోనే భర్త చనిపోయేడు. పురుషస్పర్శ యెలాటిదో తెలియదామెకు. అయినా మా అందరినీ ఎంతో ప్రేమగా పెంచి పెద్దవాళ్ళను చేసింది. తీరిక సమయాల్లో భగవద్గీత చదువుతుండేది. మరి ఆవిడ సంగతేమంటారు?'' అంది రాజ్యం.

''లోకంలో మనుషులందరూ ఒకేలా ఉండరు రాజ్యం! కొందరికి పిడికెడన్నంతోనే కడుపు నిండుతుంది. మరికొందరికి సోలెడన్నం తింటేగాని తృప్తిగా ఉండదు. శారీరక వాంఛలుకూడా అంతే! కొందరిలో చాలా తక్కువగా ఉంటయ్. మరికొందరికి తీవ్రంగా ఉంటయ్. అందుకే మీ మేనత్త, మా అమ్మా ఇద్దరూ బాలవితంతువులే అయినప్పటికీ జీవితం యెడల వారికి గల దృక్పథంలోమాత్రం చాలా తేడా ఉంది. మీ మేనత్త తనకు జీవితంలో లభించని వాటిని గురించి ఆలోచించ దలుచుకోక వున్నదానితో తృప్తి పడింది. మా అమ్మ ఉన్నవాటితో తృప్తి పొందక లేని ఆనందాలనుగురించే ఆలోచించి మనసు పాడుచేసుకుంది'' అన్నాడు రఘు.

''ఊరికే మనసు పాడు చేసుకోవటం కాదు. భయంకరంగా క్రూరంగా తయారయింది. ప్రపంచంలోని ఏ మనిషినీ ఆమె ప్రేమించ లేక పోతోంది.''

''ఔను. ప్రేమించబడని వ్యక్తి ఎప్పుడూ ప్రేమించలేడు. సుఖాలెరుగని మనిషి ఎదుటివాడి సుఖాల నెన్నడూ చూసి ఓర్వలేడు. ఒక మనిషియొక్క 'టెంపర్' అంతా ఆ మనిషిలోని కామ తీవ్రతపైనే ఆధారపడి వున్నదంటాడు ఫ్రాయిడ్ అనే మనస్తత్వ వేత్త. తీరని కోరికలతో అనుక్షణం బాధపడే మనిషి అందరినీ పీడించుకు తింటాడు. అలాటి మనుషులు మనకి కావలసిన వాళ్లు, దగ్గరి బంధువులూ అయితే అది మన దురదృష్టం....'' అన్నాడు రఘు నిట్టూరుస్తూ.

''అంతలేపి కోరికలున్న ఆడదానికి చావు కూడా సరిగ్గా రాదు. ఇలాటివాళ్ళే చచ్చిన తరువాత దయ్యాలై జీవిస్తారంటారు.'' అంది కసిగా రాజ్యం.

''ఔను తీరని కోరికలతో అలమటించే మనిషి బ్రతికి ఉండగానూ, చనిపోయిన తరువాతను కూడా తను సుఖపడడు. ఇతరులను సుఖపెట్టడు.'' అన్నాడు రఘు బాధ, జాలి మిళితమైన స్వరంతో. తెల్లవారిన తరువాతగాని భార్యా భర్తలు గది తలుపులు తీసి బయటకు రాలేదు.

వాళ్లు బయటకు వచ్చేసరికి రోజులా రంగమ్మ వంటింట్లో కాఫీ కలపటం లేదు.

ఆమె శవం బావి నీళ్ళల్లో తేలుతోంది ఆ సమయంలో:

—: ० :—